క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

కంకిపాడు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బండెల సుబ్బారావు అన్నారు. ఉప్పలూరు గ్రామ ముఖ్య బాధ్యుల సమావేశాన్ని గ్రామంలో బుధవారం నిర్వహించారు. సచివాలయ భవనంపై ఉన్న నవరత్నాల బోర్డును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేయటాన్ని ఖండించారు. దాడులు, విధ్వంసాల పేరుతో భయాందోళనకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. టీడీపీ కార్యకర్తల చర్యలకు భయపడబోమని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి కంకణబద్ధులమై పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ మాగంటి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంగల నాగయ్య, నాయకులు లాం సురేష్, నెరుసు శ్రీమన్నారాయణ, వేము మాణిక్యాలరావు, కలపాల ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో అత్యుత్సాహం



పెనమలూరు: కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావటంతో బార్ల యజమానులు, మద్యం ప్రియులు అత్యుత్సాహంతో ఉన్నారు. ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం బుధవారం చేసిన సందర్భంగా కానూరు మురళీనగర్‌లో ఒక బార్‌కు టీడీపీ జెండాలు కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. మద్యం ధరలు తగ్గిస్తానని ఇప్పటికే చంద్రబాబు ప్రకటించారు. దీంతో మద్యం ధరలు తగ్గుతాయని మద్యం ప్రియులు ఆనందంతో ఉన్నారు. అయితే ప్రమాణస్వీకారం సందర్భంగా మద్యం ధరలు తగ్గుతాయని ఆశతో ఉన్న మద్యం ప్రియులకు ధరలు తగ్గించక పోవటంతో నిరాశ ఎదురైంది. కాగా కూటమి నేతలు పండుగ వాతావరణంలో ఉండటంతో మద్యం షాపులు కిటకిటలాడాయి.

ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రమాదాలు జరిగినప్పుడు యువత స్పందించి ప్రమాదంలో చిక్కుకున్న వారికి చేతనైనంత సహాయం అందించే గుణాన్ని అలవరచుకోవాలని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల యంగ్ ఇండియన్స్ అమరావతి చాప్టర్, జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్‌లో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ వచ్చేలోగా చేయాల్సిన ప్రథమ చికిత్సపై యువతకు అవగాహన ఉండటం వల్ల ప్రాణాలను కాపాడవచ్చునని చెప్పారు. ప్రథమ చికిత్సపై అవగాహన ఉండటం వల్ల మరణాల సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సిబ్బంది అరవింద, పార్వతి హాజరై అత్యవసర ప్రథమ చికిత్స విధానాలను(సీపీఆర్) ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు వెంకటేష్, కుసుమ, బాలాజీ, సుభాకర్, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, హెల్త్ క్లబ్ ఇన్‌చార్జి విజయ్‌తో పాటుగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏలూరు రోడ్డులో అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం ఏలూరు రోడ్డులో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్, సభ్యులు పందిరి విజయ్‌మోహన్ మాట్లాడుతూ తాము ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజులలో సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ పోయిందంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటనపై బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానూనగర్‌కు చెందిన ఆర్. గోరేష్ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయన ఈనెల 6వ తేదీ రాత్రి ఇంటి ముందు ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశారు. బుధవారం ఉదయం చూసేసరికి తన ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినప్పటికీ ఫలితం లేకపోవటంతో గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎటుచూసినా ట్రాఫిక్ ఇక్కట్లే...!





సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం బుధవారం కేసరపల్లిలో నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తాయి. ఒక వైపు పోలీసు ఆంక్షలు.. మరో వైపు భారీగా వచ్చిన వాహనాలతో నగరమంతా ఎటు చూసినా ట్రాఫిక్ నిలిచిపోయి గందరగోళ పరిస్థితి నెలకొంది. సాధారణంగా రోజువారీ రాకపోకలు సాగించే మార్గాలను డైవర్ట్ చేయడంతో నగర వాసులు నానా అవస్థలు పడ్డారు. బందరు రోడ్డు, బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, రామవరప్పాడు రింగ్, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, ప్రసాదంపాడు తదితర ప్రాంతాల్లో పోలీసుల కఠిన ఆంక్షలతో జనం అల్లాడిపోయారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

- మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలలు
- విద్యనభ్యసించనున్న 6,700 మంది విద్యార్థులు
- విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కిట్లు సిద్ధం

పెనమలూరు: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు తిరిగి ప్రభుత్వం ప్రారంభిస్తుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత కలిపి 30 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో గత జగనన్న పాలనలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరి చదువుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల్లో దాదాపు 6,700 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, బెల్టు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. అయితే మండల పరిధిలో ఇప్పటి వరకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు మాత్రమే వచ్చాయి. వీటితో కిట్‌లు సిద్ధం చేశారు. ఇంకా విద్యార్థులకు బూట్లు, బ్యాగులు, 5, 7వ తరగతికి చెందిన విద్యార్థులకు రెండు టైటిల్స్ చొప్పున పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉంది. కొత్తగా విద్యార్థులు పాఠశాలల్లో చేరాల్సి ఉంది.



పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

9 గంటల నుంచి పాఠశాలలు

మండల విద్యా శాఖాధికారి కనకమహాలక్ష్మి వివరాలు తెలుపుతూ విద్యార్థులకు పూర్తిగా పాఠ్య పుస్తకాలు, కిట్లు అందిస్తామన్నారు. మధ్యాహ్నం భోజన పథకానికి సంబంధించి ఆయా పాఠశాలలకు పూర్తి సరుకులు అందాయని తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి పాఠశాలలు పని చేస్తాయని అన్నారు. విద్యార్థులు తప్పక తరగతులకు హాజరుకావాలని సూచించారు.



పంపిణీకి సిద్ధంగా ఉంచిన పాఠ్య పుస్తకాలు

రేపటి నుంచి విజయదుర్గా ఆలయ బ్రహ్మోత్సవాలు



విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో తొలి రోజున ఆలయ విమాన గోపుర సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలను అవ్వారి ఉమా శంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలతో పాటు వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయానికి రంగులతో అందంగా తీర్చిదిద్దగా, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

పూజల వివరాలు

14వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపన, ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణ, హోమాలు నిర్వహిస్తారు. 10 గంటలకు శాంతి కల్యాణోత్సవం, సాయంత్రం శారదా నృత్య పీఠంచే నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు. 15వ తేదీ ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణ, హోమాలు, విమాన గోపురం దేవతా మూర్తుల సంప్రోక్షణ, శాంతి కల్యాణోత్సవం జరుపుతారు. 16వ తేదీ ఉదయం శాంతి కల్యాణోత్సవం, మహా పూర్ణాహుతి, వేద పండితుల ఆశీర్వచనం జరుగుతుంది. సాయంత్రం ప్రధాన దేవతా మూర్తులచే నగరోత్సవం నిర్వహించనున్నామని ఆలయ అర్చకుడు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు.

స్వర మాంత్రికుడు ఇళయరాజా



విజయవాడకల్చరల్: స్వర మాంత్రికుడు ఇళయరాజా అని డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. హ్యాపీ మూమెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై బుధవారం హ్యాపీ మూమెంట్స్ అధినేత నేరెళ్ల సురేష్‌కుమార్ సంస్మరణ సందర్భంగా ఇళయరాజా సినీ గీతాల కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ భాగ్యశ్రీ మాట్లాడుతూ ఇళయరాజా అనేక భారతీయ భాషల్లో వచ్చిన సినిమాలకు సంగీతం అందించారన్నారు. పరుచూరి విజయలక్ష్మి, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, సాంస్కృతిక రంగ ప్రముఖులు కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు ప్రసంగించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

- కాలువలు, డ్రెయిన్లలో పూడికతీత
- చెరువు పూడికతీతతో పెరగనున్న నీటి నిల్వ సామర్థ్యం
- అన్ని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు

కంకిపాడు: నియోజకవర్గంలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట బోదెలు, పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పూడిక తీత, మెరకల తొలగింపుతో కాలువ చివరి భూములకు సైతం సాగునీరు చేరేందుకు ఆస్కారం ఏర్పడింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు సంబంధిత శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో అంచనాలు రూపొందించారు. మండలంలోని 20 గ్రామాల్లో 8,999 జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 15,765 మంది కూలీలు నమోదై ఉన్నారు. 12,171 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు.

15 రోజుల్లో నగదు చెల్లింపు..

ఉపాధి హామీ పథకం కింద 2024–25 సంవత్సరానికి గానూ 1,63,623 పనిదినాలను కల్పించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. 1,556 పనులను గ్రామాల్లో గుర్తించారు. ఇందుకు గానూ రూ.493.06 లక్షలతో అంచనాలను రూపొందించారు. ప్రతి రోజూ 20 గ్రామాల్లోనూ ఉపాధి పనులు జరుగుతున్నాయి. నిత్యం 1,800 మందికి తగ్గకుండా కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. రోజు కూలీ కింద ఒక్కో కూలీకి రూ.269కి తగ్గకుండా కూలీ దక్కుతుంది. పని చేసిన 15 రోజుల్లో కూలీలకు నగదు అందుతుంది.



ఈడుపుగల్లులో చెరువు పూడికతీత పనులు

సాగునీటి వ్యవస్థ మెరుగు..

ఉపాధి పనులతో సాగునీటి వ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రధాన పంట కాలువలు, బోదెలు, పంట బోదెలు, వ్యవసాయ భూముల్లో ఉన్న సాగునీటి బోదెల పూడికతీత పనులను చేపడుతున్నారు. అంతేకాకుండా ప్రజావసరాల రీత్యా ఉన్న చెరువుల పూడిక తీత పనులను సైతం నిర్వహిస్తున్నారు. ఈ పనులతో నీటి నిల్వ సామర్థ్యం పెరగటంతో పాటు కాలువలు, పంటబోదెల శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు వృథా కాకుండా సమర్థంగా చేరుతుంది.

ఏపీఓ పరిశీలన..

మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.



వేల్పూరులో పంట బోదెల తవ్వకం పనులు

వాహనాల దారి మళ్లింపుతో ప్రయాణికుల అవస్థలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గన్నవరం మండలం కేసరపల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్ వద్ద పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డు, ప్రధాన కూడలి వద్ద బారికేట్లు ఏర్పాటు చేసి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నిలువరించారు. విశాఖపట్టణం నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలి వద్ద గుడివాడ వైపునకు దారి మళ్లించగా, హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన వాహనాలను నూజివీడు వైపునకు మళ్లించారు. దీంతో 16వ నంబర్ జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ బైపాస్ వద్ద పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. పాస్‌లు లేకుండా ప్రమాణ స్వీకారానికి వెళ్లే వాహనాలను పోలీసులు నిలిపివేయటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. దీంతో జాతీయ రహదారిపై గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పనులపై దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్ ఆంక్షలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ కార్యకర్తలు

ఈఏపీ సెట్‌లో శారద విద్యార్థులకు ర్యాంకులు



ఆర్.సింధుసిరి 484వ ర్యాంకు | ఏ.మధుమేఘన 543వ ర్యాంకు | ఎస్.సంగీత లక్ష్మి 588వ ర్యాంకు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఏపీ ఈఏపీసెట్–2024 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ర్యాంకులను సొంతం చేసుకున్నారని శారదా విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.సింధుసిరి–484వ ర్యాంకు, ఎ.మధు మేఘన(543), ఎస్.సంగీత లక్ష్మి(588), వి.తోరణ్ కార్తీక్(1,058), ఏ.సంపత్(1,065), ఎ.సంజయ్(1,070), ఎం.లావణ్య (1,160), ఎం.శర్వాణి(1,270), కె.నాగరాహుల్(1,423), సీహెచ్ శ్రీసిద్ధార్థ(2,109) ర్యాంకులు పొందారని పేర్కొన్నారు. డే స్కాలర్స్ విద్యార్థులతోనే ఈ స్థాయిలో ర్యాంకులు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థులకు అభినందనలు..

తమ సంస్థలోని విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లోనే కాకుండా ఏపీఈఏపీ సెట్‌లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. తమ విద్యా సంస్థకు చెందిన ఏపీ ఈఏపీసెట్–2024 పరీక్షలో పది వేల లోపు ర్యాంకులను 120 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. చక్కటి ప్రణాళిక, అధ్యాపకుల సలహాలు, సూచనలు, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ స్థాయిలో ర్యాంకులు సాధించగలుగుతున్నామని విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి స్పష్టం చేశారు. తమ విద్యాసంస్థలో చదివే ప్రతి విద్యార్థీ జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ కళాశాల విద్యార్థులు చదువులో ఎటువంటి ఒత్తిడి లేకుండా, ప్రశాంతమైన వాతావరణంలో, చక్కటి క్రమశిక్షణతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే వివిధ ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధిస్తున్నారని కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కె.ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

కార్మిక నేత కొండారెడ్డి చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవన నిర్మాణ కార్మికుల శ్రేయస్సు కోసం విశేష సేవలు అందించిన జంగా మాలకొండారెడ్డి(జేఎం కొండారెడ్డి) ఆదర్శనీయుడని పలువురు కార్మికులు కొనియాడారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పశ్చిమ సిటీ గౌరవాధ్యక్షుడు జేఎం కొండారెడ్డి సంస్మరణ సభ బుధవారం భవానీపురంలోని ఆయన నివాసం వద్ద జరిగింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన జేఎం కొండారెడ్డి చిరస్మరణీయుడని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యం కార్మికుల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ముందుండే కొండారెడ్డి మరణం తీరని లోటన్నారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ వన్‌టౌన్‌లో మోటూరు హనుమంతరావు శ్రామిక భవన నిర్మాణంలో కొండారెడ్డి ఎంతో తోడ్పాటు అందించారని గుర్తు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో అనేక మంది మేస్త్రిలను తయారు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, ఈవీ నారాయణ, కె.సూరిబాబు, వెంకట్రావు, అంబులు, జి.రాంబాబు, పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొని కొండారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



కొండారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం స్వామివారికి శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ట్రస్ట్ అధ్యక్షుడు బల్లెం పూర్ణయ్య గురుస్వామి పంచామృతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప భజన కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.